తడిసిన ధాన్యం పరిశీలన

రాయికల్, మే 23: మండలంలోని మూటపల్లి, భూపతిపూర్ గ్రామాల్లో అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని మాజీ మంత్రి టీ జీవన్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసానిచ్చారు. అనంతరం భూపతిపూర్ గ్రామంలో గంగమ్మ తల్లి జాతర ఉత్సవాలకు ఆయన హాజరై పూజలు చేశారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

కోరుట్ల రూరల్, మే 23: మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం నుంచి ఫలపంచామృతాభిషేకాలతో పాటు తదితర పూజా కార్యక్రమాలను వేదపండితులు చేపట్టారు. కాగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు, కల్వకుంట్ల సుజీత్‌రావు, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, నాయకులు కొంతం రాజం, తిరుమల గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం

సారంగాపూర్, మే 23: రైతులకు అండగా ఉంటామని, అకాల వర్షానికితడిసిన ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. కోనాపూర్ గ్రామంలో తడిసిన ధాన్యాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు అధైర్యపడొద్దని, తడిసిన ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తడిసిన ధాన్యం కొనుగోలు విషయంలో కలెక్టర్, అదనపు కలెక్టర్‌తో మాట్లాడినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గురునాథం మల్లారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు కోల శ్రీనివాస్, తోడేటి శేఖర్ గౌడ్, నాయకులు, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను బలోపేతం చేయాలి

- రాష్ట్ర పరిశీలకుడు దుర్గాప్రసాద్
- జిల్లాలో ఉపాధ్యాయుల శిక్షణ, ఏకరూప దుస్తుల తయారీ కేంద్రాల పరిశీలన

వెల్గటూర్: మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు దుర్గా ప్రసాద్, పక్కన డీఈవో, తదితరులు

జగిత్యాల టౌన్/వెల్గటూర్/గొల్లపల్లి, మే 23: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి బలోపేతం చేయాలని రాష్ట్ర పరిశీలకుడు దుర్గాప్రసాద్ ఉపాధ్యాయులను ఆదేశించారు. జిల్లాలోని గొల్లపల్లి, ఎండపల్లి, వెల్గటూర్, ధర్మపురి మండలాల్లో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శుక్రవారం నిర్వహించిన శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలకుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించడానికి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు దోహదపడుతాయని పేర్కొన్నారు. హెడ్‌మాస్టార్లు ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తూ ఉపాధ్యాయులను కార్యోన్ముఖులను చేయాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు వివరించి, ఉత్తములుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం గొల్లపల్లి మండలం చిల్వకోడూర్‌లో ఏకరూప దుస్తుల కుట్టు కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, కొలతల ప్రకారం, సకాలంలో దుస్తులు కుట్టి పాఠశాలల పునః ప్రారంభానికి ముందుగానే అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము, కరీంనగర్ జిల్లా డైట్ ప్రిన్సిపాల్ మొండయ్య, జిల్లా కో-ఆర్డినేటర్లు, ఆయా మండలాల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఏపీవో రమణ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వెండి పూత పూసినట్లు కనిపిస్తున్న కనక సోమేశ్వర కొండ

వెండి కవచంలా కనకసోమేశ్వర కొండ..!

మండల కేంద్రంలో శుక్రవారం వర్షం కురిసిన తర్వాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. దీంతో స్థానికంగా ఉన్న కనకసోమేశ్వర కొండ వర్షపు నీటితో వెండి కవచం తొడిగినట్లు కనిపించింది. అటు వైపు వెళ్తున్న ప్రజలు, గ్రామస్తులు ఈ దృశ్యాన్ని ఆసక్తిగా తిలకించారు.

–మల్లాపూర్, మే 23

ధాన్యం మిల్లులకు తరలించాలి

మద్దునూర్‌లో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

ధర్మపురి, మే 23: జిల్లాలో తడిసిన ధాన్యం ఆరబోసి తేమశాతం వచ్చిన వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ధర్మపురి మండలం నేరేళ్ల, బుగ్గారం మండలం మద్దునూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల్లో హమాలీలు, ధాన్యం తరలించడానికి వాహనాల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కేంద్రాల నిర్వాహకులు ధాన్యం తూకం వేయడంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీవో మనోజ్‌కుమార్, డీఎస్‌వో జితేందర్ రెడ్డి, డీఎం జితేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

జగిత్యాలలో భారీ వర్షం

జగిత్యాల, మే 23: జిల్లా కేంద్రంలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం 8 గంటల వరకు భారీ వర్షం కురిసింది. 88 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మేడిపల్లిలో 86.8 మిల్లీమీటర్లు, జగిత్యాల రూరల్ మండలం పొలాసలో 76, భీమారం మండలం గోవిందారంలో 65, ఎండపల్లి మండలం గుల్లకోటలో 58, మల్యాల మండలం మద్దుట్లలో 58, కథలాపూర్‌లో 50, వెల్గటూర్‌లో 48.5, మల్యాలలో 46, కోరుట్లలో 45, నేరెళ్లలో 43.5, కొడిమ్యాల మండలం తిర్మలాపూర్‌లో 38, సారంగాపూర్‌లో 36, గొల్లపల్లిలో 34, బుగ్గారంలో 33, కొడిమ్యాల మండలం పూడూరులో 30, ఎండపల్లిలో 27, రాయికల్‌లో 26, మెట్‌పల్లిలో 20, ధర్మపురిలో 20, బీర్పూర్‌లో 19, ఇబ్రహీంపట్నంలో 10, మల్లాపూర్‌లో 7.3, పెగడపల్లిలో 0.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

29న ఆలయ భూముల లీజుకు వేలం పాట

జగిత్యాల రూరల్, మే 23: జగిత్యాల పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన సర్వే నంబర్–171 లోని భూమిలో వివిధ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు గానూ ఈనెల 29న మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

రక్తదానం

జగిత్యాల రూరల్, మే 23: చలిగల్ గ్రామానికి చెందిన చిట్యాల జమునకు చికిత్స కోసం 'బీ' ప్లస్ రక్తం అవసరం కాగా, చలిగల్ ప్రాణ దాతల సమూహం ఫౌండర్ బైర్నెని రాజేశ్వర్ రావు విషయం తెలుసుకొని శుక్రవారం రక్తదానం చేశారు. కాగా, ఆయన ఇప్పటి వరకు 49సార్లు రక్తదానం చేసినట్లు పేర్కొన్నారు. రాజేశ్వర్ రావును పలువురు అభినందించారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జగిత్యాల, మే 23: జగిత్యాలలోని వివేకానంద మినీ స్టేడియంలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను శనివారం నుంచి మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలను జిల్లా కవి, గాయకుడు గోవిందుల జలపతి, బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గువ్వ శ్రీనివాస్, పాదం మహేందర్ ప్రారంభించారు. అండర్–14 కేటగిరీలో వినయ్, సాయి, దుగ్యాల రాఘవ్ రావు, అఖిల్, రిశీథ్, శ్రీచరన్, చరణ్ సాయి, అండర్–17లో లోకేశ్, శ్రీకర్, శివ, అక్షయ్, బాలికల విభాగంలో స్వరాలి, తేజస్విని ఎంపికయ్యారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను జిల్లా క్రీడల అధికారి రవికుమార్, బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సాగర్, జాయింట్ సెక్రటరీ అరుణ్, సభ్యులు మహిపాల్ రాజు, రాజేందర్, పాదం తిరుపతి, కోచ్‌లు వంశీకృష్ణ, నవీన్ అభినందించారు.

కొండగట్టులో నేటి నుంచి ఆర్జిత సేవలు

మల్యాల, మే 23: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలను విజయవంతంగా నిర్వహించినట్లు ఆలయ ఈవో శ్రీకాంత రావు తెలిపారు. కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల ప్రకారం భక్తులు, దీక్షాపరులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. దీక్షా విరమణ మండపంలో ప్రతిష్ఠించిన ఉత్సవమూర్తులకు శుక్రవారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేసి ఆలయానికి తరలించామన్నారు. శనివారం నుంచి ఆలయంలో ఆర్జిత సేవలను ప్రారంభిస్తామని తెలిపారు.

పశువుల కొట్టం దగ్ధం

మేడిపల్లి, మే 23: మేడిపల్లిలో గోపు శోభకు చెందిన పశువుల కొట్టం ప్రమాదవశాత్తు గురువారం రాత్రి దగ్ధమైంది. కొట్టంలో భద్రపరిచిన డ్రిప్, పీవీసీ పైపులు, పనిముట్లు కాలిపోయినట్లు బాధితురాలు తెలిపారు. తహసీల్దార్ వసంత శుక్రవారం పశువుల కొట్టాన్ని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జీలుగ విత్తనాల పంపిణీ

జగిత్యాల టౌన్, మే 23: మోతె గ్రామంలో రాయితీపై జీలుగ విత్తనాలను రైతులకు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి వినీల తెలిపారు. అలాగే, రైతులకు పచ్చిరొట్ల పైరు ఆవశ్యకత, సాగు విధానం గురించి వివరించారు.

1.38 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

కథలాపూర్, మే 23: మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 1,38,523 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఏపీఎం నరహరి శుక్రవారం తెలిపారు. తాండ్ర్యాలలో 15,446 క్వింటాళ్లు, తక్కళ్లపెల్లిలో 12,550 క్వింటాళ్లు, సిరికొండలో 6,800 క్వింటాళ్లు, పోతారంలో 16 వేల క్వింటాళ్లు, పెగ్గెర్లలో 9,004 క్వింటాళ్లు, కథలాపూర్‌లో 16,446 క్వింటాళ్లు, గంభీర్‌పూర్‌లో 13,132 క్వింటాళ్లు, దూలూర్‌లో 9,309 క్వింటాళ్లు, చింతకుంటలో 10,487 క్వింటాళ్లు, బొమ్మెనలో 14,770 క్వింటాళ్లు, భూషణరావుపేటలో 5,959 క్వింటాళ్లు, అంబారిపేటలో 8,617 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

అలయన్స్ క్లబ్ జిల్లా క్యాబినెట్ సమావేశం

ఎన్నికైన క్లబ్ జిల్లా కార్యవర్గ సభ్యులు

కోరుట్ల, మే 23: పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం అలయన్స్ క్లబ్ జిల్లా క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ జిల్లా గవర్నర్‌గా బండ్ల గజానందం, జిల్లా వన్ ఉపాధ్యక్షుడిగా కటకం రాజశేఖర్, జిల్లా టూ ఉపాధ్యక్షుడిగా అవదూత రజినీ కాంత్, క్యాబినెట్ సెక్రటరీగా కొక్కుల శంకర్, ట్రెజరర్ కటకం సురేఖ, పీఆర్వోగా బండ్ల మురళి ఎన్నికయ్యారు. వీరిని క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్ సక్సేనా, క్లబ్ ఫౌండర్, ఫాస్ట్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ తిరుపతిరాజు, బాల గంగాధర్ శాస్త్రి, సభ్యులు రాజేంద్రప్రసాద్, సురేందర్ అభినందించారు.

హెచ్‌టీ సర్వీసుల మంజూరుకు సింగిల్ విండో వ్యవస్థ

జగిత్యాల, మే 23: వినియోగదారులకు హెచ్‌టీ 11కేవీ, 33 కేవీ ఆపై వోల్టేజీ సర్వీసులను త్వరగా మంజూరు చేయడానికి సింగిల్ విండో వ్యవస్థ (హెచ్‌టీ మానిటర్ సెల్)ను సర్కిల్, కార్పొరేట్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసినట్లు ఎస్ఈ సాలియా నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ వోల్టేజీ దరఖాస్తులను సర్కిల్ ఆఫీస్‌లోని ఏడీఈ (కమర్షియల్ అధికారి) మానిటర్ చేస్తారని, 33 కేవీ వోల్టేజీ, ఆపై వోల్టేజీ దరఖాస్తులను కార్పొరేట్ ఆఫీస్‌లోని ఏడీఈ (కమర్షియల్ అధికారి) మానిటర్ చేస్తారని వెల్లడించారు. కాగా, వినియోగదారులు టీజీ ఎన్పీడీసీఎల్ పోర్టల్‌లో అవసరమైన పత్రాలతో హెచ్‌టీ దరఖాస్తు (టీజీ ఐపాస్‌లో నమోదు కానటు వంటివి) నమోదు చేసుకున్న తర్వాత కొత్త అప్లికేషన్ నంబర్ (యూఐడీ) వస్తుంది. కొత్త దరఖాస్తులు ఎన్పీడీసీఎల్ సర్కిల్‌లో డాష్ బోర్డులో కనిపిస్తాయి. ప్రతి రోజూ ఏడీఈ, కమర్షియల్ అధికారులు డాష్ బోర్డును మానిటర్ చేస్తూ ఉంటారు. అలాగే, దరఖాస్తు చేసుకున్న తర్వాత 11, 33 కేవీ ఆపై వోల్టేజీ దరఖాస్తులు సంబంధిత అధికారులకు ఎస్టిమేట్ల కోసం పంపిస్తారు. ఏడీఈ/కమర్షియల్ సర్కిల్ ఆఫీస్ ఫీల్డ్ స్టాఫ్ ఫీజిబిలిటీ కోసం అవసరమైన మౌలిక సదుపాయాల కోసం లొకేషన్‌ను సందర్శిస్తారు. 33 కేవీ, ఆపై వోల్టేజీ ఎస్టిమేట్లకు కార్పొరేట్ ఆఫీస్ అధికారులు అనుమతులు ఇస్తారు.

ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం

11కెవి వోల్టేజీ దరఖాస్తులు పరిశీలించి ఫీజిబిలిటీ ఉంటే రెండు రోజుల్లో అప్‌లోడ్ చేస్తారు. వివిధ కారణాలతో సాధ్యపడకపోతే రెండు రోజుల్లో రిమార్క్ వినియోగదారుడికి ఎస్ఎంఎస్ రూపేణా పంపిస్తారు. 33 కేవీ, ఆపై వోల్టేజీ దరఖాస్తులు పరిశీలించి వాటికి కావాల్సిన మౌలిక వసతుల ఏర్పాటుకు పొందుపరిచిన సమయానుగుణంగా మంజూరు చేస్తారు.

అడ్లూరి ప్రెస్‌మీట్‌లో పవర్ కట్

- అరగంటలో మూడు సార్లు కోత

కరెంట్ పోవడంతో చీకటిలో విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, మే 23 : కాంగ్రెస్ పాలనలో మళ్లీ కోతలు మొదలయ్యాయి. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీటింగ్‌లోనే ఏకంగా మూడు కట్ కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మార్పు అంటే ఇదేనా అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గురువారం రాత్రి 7గంటల తర్వాత జగిత్యాల కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై ప్రెస్‌మీట్ పెట్టారు. దాదాపు అరగంట పాటు మాట్లాడారు. కానీ, సమమంలోనే మూడు సార్లు పవర్ కట్ అయింది. ఆయన మాట్లాడుతుండగానే కరెంట్ పోవడంతో విలేకరులు తమ సెల్‌ఫోన్లలో రికార్డు చేయగా, ఇది ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 'మార్పు రావాలి.. కాంగ్రెస్ రావాలి' అంటూ ప్రచారం చేసిన నాయకుల ప్రెస్‌మీట్‌లో ఇలా పవర్ కట్ కావడంపై ప్రజలు సెటైర్లు వేస్తున్నారు. మార్పు అంటే ఇదేనా అంటూ ప్రశ్నిస్తున్నారు.

లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు

వెల్గటూర్: దరఖాస్తుదారుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఇతర అధికారులు

సారంగాపూర్/కొడిమ్యాల/కోరుట్ల రూరల్/మల్లాపూర్/మల్యాల/కథలాపూర్/పెగడపల్లి/వెల్గటూర్, మే 23: సారంగాపూర్, కొడిమ్యాల, కోరుట్ల, మల్లాపూర్, మల్యాల, కథలాపూర్, పెగడపల్లి, వెల్గటూర్ మండల పరిషత్ కార్యాలయాల్లో శుక్రవారం అధికారులు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవోలు గంగాధర్, స్వరూప, రామకృష్ణ, శశికుమార్‌రెడ్డి, అవునూరి స్వాతి, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఆయా బ్యాంక్‌ల మేనేజర్లు పాల్గొన్నారు.

26 నుంచి ఇంటర్వ్యూలు

మెట్‌పల్లి టౌన్, మే 23: రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు దారులకు ఈనెల 26 నుంచి 28వ తేదీ మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కమిషనర్ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు తమ వెంట ఆన్‌లైన్‌లో చేసిన ఫారం, ఆధార్, రేషన్, పాన్ కార్డు, కుల, ఆదాయ సర్టిఫికెట్లు, బ్యాంక్ ఖాతా, రెండ్ పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో రావాలని పేర్కొన్నారు.

కోరుట్ల, మే 23: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుదారులకు ఈనెల 24 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కమిషనర్ మారుతీ ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు సకాలంలో రావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మెట్‌పల్లి, మే 23: మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఆరపేట శివారులో 63వ జాతీయ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరపేటకు చెందిన చక్రాల రాజంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు రాజంను మెట్‌పల్లి దవాఖానకు తరలించారు.

భారత సైన్యం విజయానికి ఉపాధ్యాయుల సంఘీభావం

సారంగాపూర్, మే 23: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సైన్యం పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసి పాకిస్తాన్‌కు వణుకు పుట్టించేలా చేయడం పట్ల శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు భారత సైన్యానికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కిశోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తెమట్టెలు అందజేత

కథలాపూర్, మే 23: కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామంలో కట్కూరి గౌతమి వివాహానికి మాజీ సర్పంచ్ పిడుగు లావణ్య–తిరుపతిరెడ్డి దంపతులు పుస్తెమట్టెలు శుక్రవారం అందించారు. యువతిది నిరుపేద కుటుంబం కావడంతో తమవంతుగా పుస్తెమట్టెలు అందించినట్లు వారు పేర్కొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

మల్యాల, మే 23: మండల కేంద్రానికి బోదాసు శంకర్ (37) శుక్రవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం జగిత్యాల ఏరియా దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు పరిశీలన

మల్యాల, మే 23: మల్యాల ఎక్స్‌రోడ్ చౌరస్తాలో గల ఎస్ఎస్‌వీ పాఠశాలలో నిర్వహిస్తున్న టీచర్ల శిక్షణ తరగతులను సైకాలజీ నిపుణుడు పడాల తిరుపతి పర్యవేక్షించారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జయసింహారావు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వివాహ వేడుకకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి హాజరు

నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి కొప్పుల

మేడిపల్లి, మే 23: మేడిపల్లి మండలం కొండాపూర్ మాజీ సర్పంచ్ ద్యావనపెల్లి అభిలాష్ వివాహం రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన మోర వెంకటేశ్వర్లు–విజయలక్ష్మి దంపతుల కూతురు సుష్మజతో శుక్రవారం జగిత్యాలలోని సుమంగళి గార్డెన్స్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్లు తుల ఉమ, దావ వసంత, బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య, ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల/జగిత్యాల రూరల్, మే 23: తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఆదేశించారు. జగిత్యాల రూరల్ మండలం చలిగల్ వ్యవసాయ మార్కెట్‌తో పాటు తిప్పన్నపేటలో తడిసిన ధాన్యాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులు అధైర్యపడొద్దని, తడిసిన ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, మల్లారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు దామోదర్ రావు, నక్కల రవీందర్ రెడ్డి, పెండెం రాములు, బాల ముకుందం, కోల శ్రీనివాస్, శేఖర్ గౌడ్, గంగారెడ్డి, పురిపాటి రాజిరెడ్డి, బోనగిరి నారాయణ, సీఈవో వేణు, మల్లేశ్, కొప్పు మహేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎస్ఐలకు ఆత్మీయ సత్కారం

ఇబ్రహీంపట్నం/మేడిపల్లి, మే 23: ఉత్తమ ఎస్‌హెచ్‌వోగా ప్రశంసా పత్రం అందుకున్న ఎస్ఐ అనిల్‌ను మెట్‌పల్లి ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు మైలారపు రాంబాబు శుక్రవారం సంఘ సభ్యులతో కలిసి శాలువాలతో ఆత్మీయ సత్కారం చేసి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి ఎల్మి రవి, కోశాధికారి దొంతుల లక్ష్మీనారాయణ, కొత్తూరి నవీన్ కుమార్, పడిగల శ్రీనివాస్, కిరణ్‌కుమార్, లవకుమార్, సంతోష్ పాల్గొన్నారు. అలాగే, ఉత్తమ ప్రశంసా పత్రం అందుకున్న మేడిపల్లి ఎస్ఐ శ్యామ్‌రాజ్‌ను రాజలింగంపేట మాజీ సర్పంచ్ మల్లేశం, నాయకులు శంకర్, నరహరి శాలువాతో సత్కరించారు.


ఇబ్రహీంపట్నం: ఎస్ఐని సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

మొక్కలు నాటి సంరక్షించాలి

రాయికల్: మొక్కలపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్

మెట్‌పల్లి టౌన్ , మే 23: మానవ మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ కోరారు. అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉమెన్స్ ఫర్ ట్రీస్ కార్యక్రమాన్ని పట్టణంలోని పెద్దచెరువు వద్ద నిర్వహించారు. చెరువు వద్ద ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటి, నీళ్లు పట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మోహన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ నాగేశ్వర్‌రావు, ఆర్వో అజ్మతుల్లాబేగ్, శానిటర్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఆర్ఐ అక్షయ్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ విష్ణువర్ధన్‌రెడ్డి, టీఎంసీ సోమిడి శివ, ముజీబ్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్, మే 23: మానవ మనుగడకు మొక్కలే జీవనాధారం అని మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెరువు కట్టలపై, చెరువు కింద మహిళా సంఘాల సభ్యులు మొక్కలు నాటి, సంరక్షించాలన్నారు. అనంతరం మెప్మా ఆర్పీలకు మొక్కలు నాటే కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా డీఎంసీ సునీత, సీవో శరణ్య, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాలో వసతులు కల్పించాలి

కోరుట్ల, మే 23: బక్రీద్‌ను పురస్కరించుకొని పట్టణంలోని ఈద్గా మైదానంలో వసతులు కల్పించాలని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మారుతీప్రసాద్‌ను శుక్రవారం మజ్లిస్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఫీ, అబ్దుల్ వాజిద్, రవూఫ్, రహీం, సమీర్, సురేశ్, ముజాహిద్, కలీం, మున్నా, ఫయాజ్ పాల్గొన్నారు.

విశ్రాంత సైనికులకు సత్కారం

విశ్రాంత జవాన్లను సన్మానిస్తున్న ఎంఈవో లక్ష్మీనర్సయ్య

మేడిపల్లి, మే 23: మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధ్యాయుల వృత్యాంతర శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భోజన విరామ సమయంలో ఉద్యోగ విరమణ పొందిన జవాన్లు బండారి రమేశ్, మెట్టు ప్రకాశ్, నాంపల్లి అంజయ్యను ఎంఈవో ఆకుల లక్ష్మీనర్సయ్య శాలువాలతో సత్కరించారు. ఉద్యోగ విరమణ పొందిన జవాన్లు ఈ పాఠశాలలో చదవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోయినపల్లి ప్రసాద్ రావు, గడ్డం తిరుమల్‌రెడ్డి, మునీందర్, ప్రవీణ్, సురేందర్, శ్రీనివాస్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

వెల్గటూర్, మే 23: ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన బూట్ల రాజేందర్ గత నెలలో సౌది అరేబియాలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, అదే గ్రామానికి చెందిన ఆరెల్లి ఆకాశ్ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు సింహాచలం జగన్, చల్లూరి రాంచందర్, కోడి గంగయ్య, గంగుల నగేశ్, రామడుగు రాజేశ్, జూపాక కుమార్, మూగల సత్యం, సురేశ్, మౌనిక, రాజేశం తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
LOST
★ Regula Kanakaraju S/o Bhoomaiah, V/o. Nampalle, Anupur, Vemulawada mandal, Rajanna Siricilla Dist. my passport No. E1662116 lost by travelling, any one found please call me. 6300662510.
NTK-000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189